# రోకలి

జ్యోతి యిల్లు చిమ్మకుంటున్నది. పనిమనిషి రాదని కబురొచ్చింది. దొడ్లో జాజిచెట్టు కింద పడేసి వుంచిన గిన్నెలు ఒక ప్యూన్ తోముతున్నాడు పొద్దున యెనిమిది దాటింది. పొద్దెక్కుతున్నది. పిల్లలు పాలూ ఫలహారం కానిచ్చి దగ్గర్లోనే వున్న బడికి పరుగుదీశారు. మరొక ప్యూను పక్క దుప్పట్లు దులిపివేస్తూ, రంగుల యీకల కుంచెతో కిటికీ తలుపులు చువ్వలు, రేడియో పుస్తకాల షెల్ఫూ దులుపుతున్నాడు,

అది బికాంపు. పది పెద్ద బంగళాల పేరు ఇటైపు. చుట్టూ ఖాళీస్థలం. ముళ్ళతీగతో ఫెన్సు అందమైన గేటు. పూలతోట కూరపాదులు, ఆకుమడులు, కొళాయి, పాలసపోటా చెట్టు, ఫెన్సు దగ్గరగా రేగు చెట్టు, బంగళా లోపల దొడ్లో పెద్దజాజి, కరివేప చెట్టు, బీన్సు మొక్కలు బెండమొక్కలున్నాయి.

గేటు తీసుకుని యిద్దరు ప్యూన్లు వచ్చారు.

హనుమంతు యాక్షన్ చేస్తూ అడిగాడు. "మా దొరసానిగారు కరేపాకు తెంపి తెమ్మన్నారమ్మా."

అది వింటూనే జ్యోతి ప్యూన్ నాగోజీ దొడ్డివేపు వెళ్ళి కరివేప చెట్టుకొమ్మలు తుంపి కట్టలాగా చేసి తెచ్చిచ్చాడు. హనుమంతు వెళ్ళిపోయాడు.

గిడ్డయ్య చేతులు కట్టుకు నిలబడి అన్నాడు. "మాయమ్మ గారు రోకలి అడిగి తీసుకురా అని తోలారు. ఇస్తే పోతాను".

నాగోజీ జ్యోతివంక చూస్తూ అన్నాడు. 'ఇదివరకిలా వీడిని తోలితే రెండుసార్లు రెండు రోకళ్ళిచ్చానమ్మా. అవి రిటరన్ చేయ లేదు. రోకలి పత్రమ్మని మళ్లా పంపారు.'

'విన్నావుగా' అన్నది జ్యోతి.

గిడ్డయ్య వెళ్లి తిరిగి వచ్చాడు. వాడి వెనకాలే సుగంధీ వచ్చింది, "కాస్త పిండి దంపిద్దామని, రోకలి కోసం పంపితే లేదన్నావుట? అరిగిపోతుందా? పక్క క్వార్టర్సేగా! రావటం మానే శావేం! నన్ను చూసి పోతూ వుండద్దూ!" అంటూ వరండా మెట్లెక్కు తున్నది సుగంధి.

జ్యోతి తన చేతిలోని కొండచీపిరి మూలాలగా ఆనించి యెదు రెళ్ళింది. "వచ్చే పెట్టే పోయే పెట్టే, ఇవిగాక ఆఫీసరుగారితో పనుండి రోజూ యిద్దరూ ముగ్గురూ అతిథులొస్తూ వుంటారు. మర్యాదగా మసులుకోవాలి. తీరికలేక మిమ్ము చూడరాలేదు. మరో వుపద్రవం యివాళ పని అమె నాగా పెట్టింది. యెక్కడి పని అక్కడున్నది. ఇల్లన్నా తుడుద్దామని తుడుస్తున్నాను. మిమ్మల్ని చూడాలనే వుంటుంది. రోకలి అరిగిపోదు గానండీ, ఒక రోకలి మా ఆఫీసరుగారు తన తలకి చుట్టమంటే చుట్టాను. దాంతోనే ఆఫీసుకెళ్తున్నారు. ఇంకా తీయలేదు" అంటున్నది జ్యోతి.

సుగంధి మొహాన నవ్వు వెలిసింది. "నీదంతా హాస్యం. ఫిక్షన్ గూడా జోడిస్తావు. ప్యూన్లున్నారుగా. పనిమనిషి నాగా పెడితేనేం? వాళ్ళని మేపుతావుగా! పనిమంతురాలినని నలుగురికీ తెలియాలని చీపిరందుకున్నావు."

"అవతల పెట్టాగా ఇపుడొస్తా మీ క్వార్టర్సుకి పదండి పోదాం, కరివేపాకు కోసి తీసుకురా." అన్నది జ్యోతి.

ప్యూనూ, సుగంధీ గేటు దాటుతుండగా నాగోజీ కరివేపాకు కట్టతో వెనకాలే వచ్చాడు.

"తలుపు వేయక్కర్లా" అన్నది సుగంధి.

"చెప్పాగా. అతిధులున్నారని మేడమీద యిద్దరూ, కింద బెడ్‌రూమ్‌లో యిద్దరూ వున్నారు. డ్రెస్ చేసుకుంటున్నారు."

పక్క క్వార్టర్సు గేటు తీసి లోపలికెళ్తూ జ్యోతి అన్నది.

'మీరు ఇంటీరియర్ డెకరేటరనీ, బంగ్లా చూడముచ్చటగా వుంచుతారనీ, మా ఆఫీసరుగారు మెచ్చుకుంటారు. చూద్దామా? నేను గూడా అలా అందంగా వుంచుతాను.'

సుగంధికి గర్వం కలిగింది. పరపురుషుడు తనను మెచ్చాడు. మూడు బెడ్‌రూమ్స్, రెండు బాత్‌రూమ్స్, డ్రాయింగ్‌రూమ్, డైనింగ్ రూమ్. మధ్యగా కడ్డీకి రింగులతో అందమైన కర్టెన్. డైనింగ్ బల్ల చుట్టూ ఆరు కుర్చీలు రోజ్ వుడ్‌వి. టేబిల్ మీద అందమైన డిజైన్ రంగులతో వేసిన తెల్లని క్లాత్. కుర్చీలకు పూలు కుట్టిన కవర్లు

సిల్క్ కుషన్స్. ఫ్రిజ్ దానిమీద కవర్ మట్టిపడకండా. స్టాండ్ ఫాన్, దానికి కవర్. టేబిల్ మీద పింగాణీ టీ కెటిల్. టీ చల్లారి పోకండా దానిమీద కవర్ అర్థచంద్రాకారంలో వున్నది. దాని మీద పూలప్రింట్ లోపల వల్చగా దూది, పట్టుకు తీసేందుకు పూలుబంతిలాగా కుట్టింది. సీలింగ్ ఫాన్ మెరుస్తున్నది. అద్దాల తలుపులున్న అల్మరలో కప్పులూ సాసర్లూ, గాజుగ్లాసులూ, డిన్నర్ ప్లేట్లూ అమర్చి వున్నాయి డ్రాయింగ్ రూమ్‌లో కుర్చీలకీ, సోఫాకీ కవర్లు. డన్‌లప్ దిళ్లకి కవర్లు పూలు కుట్టినవి మధ్య బల్ల దాని మీద మందపాటి అద్దం మెరుస్తుంటే, అద్దం కింద ఫొటోలు. చిన్న టేబిల్స్ వాటిమీదే తెలుగు ఆంగ్ల పత్రికలు, శంఖం. మరో దాని మీద సిగరెట్ టిన్ ఒక సిగరెట్ పైకి వచ్చి కనబడుతున్నది. అద్దాలున్న షెల్ఫ్ అందులో అరలలో ఆల్బమ్స్, పుస్తకా లున్నాయి. షెల్ఫ్‌మీద రుమాలా దానిమీద స్టాండున్న ముఖ చిత్రాలు, గ్రూపు ఫోటో కిచెన్‌లో కెళ్ళారు నీటుగా వుండి గిన్నెలు గరిటలు అమర్చి వున్నాయి. ముంబాయి స్టౌ, గాస్ స్టౌ, ఓవెన్, స్టోర్‌రూమ్‌లో కెళ్ళారు. అరలలో డబ్బాలు ప్లాస్టిక్ బుట్టలు అలా చూస్తుండగా జ్యోతి కళ్ళు మూలగా ఆనించి వున్న రోకళ్లు రెండూ రాగోల, దోకులబార, అందమైన చిన్న గునపం మీద వాలాయి.

'చూశారా. పనిలో వుండి కుటరన్ చేయటం మరిచిపోయారు. ఇవి మావే స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్ డైరెక్టరుగారికి మా ఆఫీసరు గారు మంచి క్వార్టర్స్ ఎలాట్ చేయించారు. ఆయన మెచ్చి యివి చేయించి యిప్పించారు, వేడుకకి, మెషీన్‌తో నా పేరు వాటిమీద

చెక్కించారు. రోకళ్ళకి రెండువేపులా పొన్నులు వేయించారు. యెటైనా తిప్పి దంచవచ్చు.' నవ్వుతూ ఒక్కొక్కటే అందుకుంటూ,

'తీసుకో నాగోజీ. పోవాలి. పని వదిలి వచ్చాము' అని తోలుకెళ్ళింది జ్యోతి.

2

స్నానం కానిచ్చి యిస్త్రీ గుడ్డలేసుకుని జ్యోతి గబగబా వంట కానిస్తున్నది. నాగోజీ అక్కడే వుండి హెల్పు చేస్తున్నాడు.

స్వర్ణలత ఛీప్ అకౌంటెంట్ భార్య. జ్యోతి బంగ్లా వెనకే వాళ్ళ బంగ్లా, ముళ్ళతీగ ఫెన్సులాగా వుంటుంది.

దాని పేరు బి కాంప్. పెద్ద క్వార్టర్సు పది. వాటిని ఇ టైప్ అంటారు. చుట్టూ స్థలం వదిలారు. పూలమొక్కలు, కూరపాదులు, ఆకుమడులు ఒక అరటి చెట్టు, పాలసపోటా, ఫెన్సుకానుకుని రేగు చెట్టు, లోపల ఖాళీస్థలంలో పొట్ల, బీన్సు, చిక్కుడు, కరివేప చెట్టు పెద్ద జాజితీగ పందిరి, కొళాయి, చప్టా అంట్లు తోమేందుకు వీలు.

రెండు తీగలు కలిపి తాడుతో కట్టించి దూరి వస్తుంది స్వర్ణ లత వెనకవేపు తలుపు తీసి వుంటే అటే వస్తుంది.

వంటింట్లోకొచ్చింది చొరవగా. 'జ్యోతీ గొట్టం గోదుమపిండీ, గొట్టం మైదా బదులివ్వు. వున్నాయిలెమ్మని తెప్పించలేదు. పూరీలు, పేణీలు, గవ్వలు చేయాలి. అడపడుచు వచ్చింది. చేయటం చూపు తుందిట' అని నిలబడింది.

'స్టోర్‌రూమ్‌లో కెళ్దాం రండి, సాంబారుడుకుతున్నది' అని తీసికెళ్ళింది. జ్యోతి డబ్బాల మూతలు తీస్తుండగా స్వర్ణలత కళ్ళు రోకళ్ళమీద పడ్డాయి. చంద్రకొయ్యతో చేసినవి మెరుస్తున్నాయి.

"రెండెందుకు జ్యోతీ రోకళ్ళు ఇద్దరు పనివాళ్లున్నారా? ఒక్కతేనే. దాన్ని పంపమని అడిగితే పంపావు నేను పెట్టుకున్నా. పిండి దంపమన్నానని మానేసింది దంపక్కర్లేదు రమ్మని చెప్పమని పూర్యాన్ని పంపితే వచ్చింది పనిలోకి"

"రెండు గాదు. మూడు. ఒకటి మా ఆఫీసరుగారు తలకు చుట్టమని అడగంగానే చుట్టేందుకు రెండోది యెవరైనా యిమ్మని అడిగితే యిచ్చేందుకు. వారు తిరిగి యిచ్చేయకపోతే స్పేర్ రో.లి నాకూ." అలా అంటూ గోధుమా, మైదా పొట్లాలు గట్టి అందించింది జ్యోతి.

"థాంక్స్ నీకు బాగా హ్యూమరున్నది. కాని మరీ మోటు హ్యూమరు. మీ ఆఫీసరుగారు వెర్రి కుదిరింది రోకలి తలకు చుట్టమంటారంటున్నావా?" అని భుజంమీద చరిచింది.

"అనటమేమిటీ? అంటుండగా చూడాలనీ వినాలనీ వుంటే బెడ్‌రూమ్‌లో స్క్రీన్ వెనక మెత్తని సోఫాలో కూచోండి. వినోదించవచ్చు. మీరక్కడున్నట్టు తెలియకుండా భద్రతలు తీసుకుంటా. ఆఫీసరుగారి నుమాని చరు.

స్వర్ణలత బాగా నవ్వింది. "బలే గడుస్తనం తప్పక వస్తా

మా ఆఫీసరుగారు శ్రీశైలం కాంపు వెళ్లారు. అయిదురోజుల వరకు రారు. నాకు పొద్దుబోవాలి వినోదిస్తా. సరేగానీ నాకోసారి దోకుల బార అరువియ్యి. పూలమొక్కలు కనబడకుండా గడ్డీ పిచ్చి మొక్కలూ పెరిగాయి. తీయించి, నీ వస్తువు రిటరన్ చేస్తా" అని నవ్వుతూ "వీలుంటే యేమనుకోకపోతే, ఒక రోకలీ యివ్వు. అత్తగా రొచ్చింది. అరిశలు నువ్వులద్దీ చేయటం చూపుతారట. బియ్యం నానబోయమన్నారు. దంపుడు పిండే కావాలిట. బియ్యిప్పిండి అప్పడాలూ చేసి చూపుతానన్నారు" అన్నది.

"అలాగే. నాగోజీ, రోకలీ, దోకులబారా వెనక క్వార్టర్సులో పెట్టిరా. అమ్మగారివెంట వెళ్లు." అన్నది జ్యోతి.

నాగోజీ ఆ రెండు పట్టుకుని స్వర్ణలత వెంట వెళ్లాడు.

3

మరునాడు మధ్యాహ్నం రెండు గంటలైంది. పిల్లలు వచ్చి లంచ్ కానిచ్చి బడికి పరుగెత్తారు. జ్యోతి టేబిల్ క్లీన్ చేస్తున్నది.

గాలి దుమారంలాగా భర్త యింట్లోకి దూసుకు వచ్చాడు.

"జ్యోతీ, వడ్డించేయ్. వాళ్లు లంచ్ కానిస్తూనే వెళ్ళిపోతారు. ఇక్కడుండటానికి రాలేదు," ఆఫీసర్ బెడ్‌రూమ్‌వేపు వెళ్ళాడు.

"వాళ్ళెవరండీ? యెందరండీ?" అన్నదటే చూస్తూ

"గుడ్డి ప్రశ్నలతో టైమ్ వేస్టు చేస్తావు కనపడటం లేదూ. కర్టెన్ పల్చనిదేనే. నన్ను విసిగించకు. వివరాలనవసరం." తలుపేసుకున్నాడాఫీసర్.

జ్యోతి పన్నెండు డిన్నరు ప్లేట్లు తెచ్చి బల్లమీదుంచింది. నాలుగు ప్లేట్లలో వడ్డించేసింది. గాజు గిన్నెల్లో స్వీట్స్ వుంచుతుండగా ఆఫీసర్ వచ్చేశాడు దుస్తులు మార్చుకుని.

"రండి, రండి. కానిద్దాం మళ్ళా సెమినార్ బిగిన్ అయే సమయానికి అక్కడుండాలి మీరు. అదుగో బేసిన్. వేంగర్ కి టవల్. సబ్బు అక్కడే వుంటుంది" తాను నాప్‌కిన్ ఒళ్ళో పరుచుకుని నవ్వుతూ యేమి తినాలో చూస్తున్నాడు.

అతిధులు వచ్చి కూచుని తింటున్నారు. కొంత ఆకలి తీరాక ఐస్‌వాటర్ తాగాక అన్నివేపులా చూశారు.

"ఇన్ని ప్లేట్లెందుకమ్మా. ఇద్దరమేగా అతిధులం" అన్నాడో గెస్టు.

"అభ్యాగతులకోసమండీ. భక్తసిరియాలలాగా మా ఆఫీసరు గారు లంచ్‌కి యెవరిని లాక్కొస్తారో తెలియదు. ఓ రోజున నిరుపమ అనే కలెక్టరమ్మ చూచిపోవటానికొస్తే, "రండి రండి కలెక్టరుగారూ, మువ్వంకాయా వడియాలూ వూరగాయా చాలా రుచి, మీకిష్టమైనవి గూడాను కూచుని స్పూన్‌తో తినండి. ఫోర్క్ కావాలా?" అని అందిస్తే నిరుపమ సంతోషంగా లంచ్ కానిచ్చింది. అంతలోనే సుజాత అనే హెల్తాఫీసరొచ్చింది పనిమీద. యేదో సంతకం కావాలిట ఆఫీసరుగారామెనూ ఆహ్వానించారు సంబరపడుతూ."

"అంతమందికోసం వంట చేస్తారా అమ్మా" రెండో గెస్టు అడిగాడు.

''ఫాస్ట్‌ఫుడ్ రెస్టారెంటులోలాగా తయారుచేస్తావండీ. ఎలక్ట్రికల్ కుకర్. మైక్రోలిన్, పూరీ, దోసి, బెడ్‌రోస్ట్, అమ్లెటీ నిమిషాల మీద సిద్ధంచేసే మెషీన్లు కొన్నారు ఆఫీసరుగారు. అవి వాడకపోతే పాడైపోతాయి'' లోపలికెళ్ళింది జ్యోతి.

టేబిల్ క్లీన్ చేసి తానూ లంచ్ కానిస్తున్నాది జ్యోతి.

''జ్యోతీ యేం చేస్తున్నావ్. నా లుంగీ లాల్చీ కనపడలేదు'' బెడ్‌రూమ్‌లోంచి కేక.

జ్యోతి బెడ్‌రూమ్‌లోకి జాగింగ్‌లాగా వెళ్ళింది.

''రాత్రి పడలేదు గదండీ అయినా తల్లింపుస వుంచాను కావాలేమోనని, షర్ట్ తీసేస్తే కటబనియన్ లోపలుంటుంది. ఫాన్ తిరుగుతున్నది. ఎ సీ స్టార్ట్ చేయనా''

''సరేలే సోది. వాళ్ళను సెమినార్ హాల్ దగ్గర దింపి రమ్మంటినే ఇంట్లోనే వున్నావేం అది కొత్తకారు. వాళ్లకు తిన్నగా డ్రైవింగ్ రాదు చెప్పించి చేయాలని వుండదా?'' అన్నాడు బెడ్ మీద వాలుతూ

యస్టీకి పోలీసు శాఖవారు డ్రైవింగ్ వుచితంగా నేర్పుతున్నారని పేపర్లో చదవాను. మీరు తిరుపాలుకి డ్రైవింగ్ నేర్పించారు'' అంటున్నాది జ్యోతి.

''అదంతా నిజమేలే. నాకు మతిపోతాదింకా. నువ్వు ప్యూను చేత పనిచేయించటం చేతకాక తరిమేస్తావైపాయె. నీకు ఎడ్మినిస్ట్రేషన్ రాదు.''

"తిరుపాలుకి సర్వెంట్ క్వార్టర్స్ ఎలాట్ చేసి, ఫామిలీతో వుండమన్నారు. పిలవగానే రావాలి. కారు మెరిసేట్టుంచాలి అన్నారు వాడు కారు దగ్గరే వున్నాడు. తుడుస్తున్నాడు. అతిధులు కారులో కెక్కగానే తోలుకెళ్లాడు, "ఈపాటికి తిరిగి వస్తూవుండాలి."

"ఇగ్నిషన్‌కీస్ నువ్విచ్చావా?"

"నేవివ్వలేదు, మీరే యిచ్చుకున్నారు కారులోంచి దిగుతూనే,"

"మావాళ్లు నిన్ను రమ్మని రాస్తే నువ్వు వెళ్లలేదు. మా అన్న ఆఫీసుకి ఫామ్స్ పంపాడు, నువ్వు వెళ్లాలి, యెంత చెట్టుకంత గాలి అని వచ్చింది వచ్చినట్టయిపోతున్నదిట, వాడిని పట్టించుకునే వారే లేకుట."

"అదేమన్నమాట, కోడలున్నాది,"

"కోడలు నచ్చలేదు."

"శ్యామలాంబ అనే గురువును తెచ్చుకున్నారు మనశ్శాంతీ, స్వర్గసౌఖ్యం యిస్తుందని తెచ్చుకుని రెండుపూటలా షోడశోప చారాలు చేస్తున్నారు గదండీ" అని దీర్ఘం తీసింది.

"అవి అందుతున్నట్టూ లేదు, ఆయిస్తున్నట్టూ లేదు, రోజూ యేడుస్తూ ఫామ్స్ రిలీజ్ చేస్తున్నాడు, వాడిని ఆడిస్తూ దోచేస్తున్నదని చెప్పుకుంటున్నారుట, ఆమె పెద్దగా చదువుకోనూ లేదని తేలిందిట, యేమడిగినా వివరీకరించనూ లేదు, శ్రీసూక్తమే రాదన్నదిట, ఇక్కడా అక్కడా విని పట్టుకున్నా నాలుగు ముక్కలు వల్లిస్తూ

గెల్చుకొస్తున్నాడిట నువ్వెళ్లి ఆమెను వాదనలోకి దింపి ఓడించి తరిమేసి మా అన్నకి స్వేచ్ఛ యిప్పించాలి" అంటున్నాడు పైన తిరిగే ఫాను వంక చూస్తూ

"మీరు కూడా రారూ?"

"నేనెందుకూ? యేం లాభం, నాకు మతవిషయాలూ రావు తర్కమసలే రాదు ఇవాళ బయలుదేరు."

"మనం వేదాలనీ, శాస్త్రాలనీ, మతాన్నీ, సంఘాన్నీ తూస్కరించామే, మీరేమో వేదాలు మన ఋషులల్లినవి గాదు, జెసూట్సు, జాకో బైట్సు పాడుతుంటే మనవాళ్లకు పట్టుబడినై. జర్మన్స ప్రూఫ్ వేశారంటిరే"

"నువ్వు చేయబోయేది మానవహక్కుల పరిరక్షణ, నేను నా వాళ్లను నీకోసం డి జోన్ చేయలేదు, చేయబోను నిన్ను పంపమని అడిగే హక్కు వారికున్నది, పంపే అధికారం నాకున్నది."

"ఆ స్కీమ్ ననుసరించి వెళ్లననే హక్కు నాకూ వున్నట్టే"

"లేదు. నీవిప్పుడు గెజెట్ ఆఫీసర్ భార్యవి. నీకా స్టేటస్ వుచితంగా లభించింది. నెగెటివిజమ్ అప్లై చేస్తూ వెళ్ళకపోతే డౌన్ పాలౌతావు. మంచి స్టేటస్ వదిలేస్తావా? మతిపోయిందేమిటీ తిరుపాలికి డబ్బిచ్చా. టికెట్ తెచ్చి నిన్ను రైలెక్కిస్తాడు."

వాకిట్లో కారు హారన్ "హలో గిరీ! మైడియర్ లక్కీగా నీ కారాగింది. నీ డ్రైవరే నన్ను గుర్తుపట్టి యెక్కించుకుని తెచ్చేశాడు.

నా భార్య సెమినార్లో పాల్గొనటానికి వస్తుంటే తోడు వచ్చా. నేను షాపింగ్ చేస్తుంటే, నీ డ్రైవరు గమనించాడు. నా భార్య రాత్రికి భోజనానికి వస్తుంది'' లోపలికొచ్చేస్తున్నాడు ఫ్రెండ్ రమేష్.

గిరి లేచాడు. ''ఫర్గెట్ అండ్ ఫర్గివ్. పాత విషయాలూ, అవమానాలూ, వుత్తరాలు గుర్తు చేసుకుంటూ, మా వాళ్ళను హర్ట్ చేయకు. పూసుకు తిరగాలి. గతం నాస్తి అనుకో. యేమైనా జరిగితే అది నావల్లే జరిగింది. నిన్ను మొదటినించీ గౌరవంగానే చెప్పకున్నారు'' అని లేచిపోయాడు.

జ్యోతి స్క్రీన్ వెనకాలికెళ్ళింది.

''నేనిటుగా పోతా జ్యోతీ. వాళ్ళ కంట బడాలని లేదు. వెర్రి కుదిరింది రోకలి తలకు చుట్టమన్నట్టే వున్నాయి డైలాగులు'' అని నవ్వింది.

జ్యోతి అటువేపు తలుపు తీసింది. స్వర్ణ పూలతోటలోంచి వెళ్లింది.

4

నాల్గురోజులు గడిచిపోయినై. జ్యోతి వరండాలో కుర్చీలో కూచుని రుమాలా అల్లుతున్నది. రంగుదారపు వుండలు కింద వున్నాయి. గేటు చప్పుడు విని తలెత్తింది.

ఇంకా పొద్దూకలేదు. సూర్యుడస్తమించాడు. స్నో అనే కుక్కపిల్ల అరుస్తూ వరండా మెట్లు దిగి వచ్చే ఆమె వేపు వెళ్ళింది.

"రండి. నవ్వుతున్నారే. ఆనందానికి కారణమేమిటి. పనైందా ఎక్స్కర్షన్‌కి వెళ్ళిన పిల్లలు వచ్చారా? బ్లోటెట్ చూశారటనా, ఇలా ఆ కుర్చీలో కూచోండి" అన్నదల్లుతూనే.

"ఫార్మాలిటీస్ చెల్లిస్తావు జ్యోతీ. కల్చర్ట్ పెరల్‌లాగా వుంటావు. అందుకే బి కాంప్‌లోని క్వార్టర్సులోని వాళ్ళంతా నిన్ను చూడవస్తారు. మరో విశేషం యేదడిగినా యిస్తావు" కుక్కపిల్ల నెత్తుకొచ్చి కుర్చీలో స్థిరపడి ఒళ్ళో పెట్టుకున్నాది కనకరత్న సిటివో భార్య.

"యెంత తెలుపో రోజీ, రోజు స్నానం చేయించి పౌడరూ సెంటూ గూడా అద్దుతావాయేం. మెత్తగా మెరుస్తున్నాది బొచ్చు. కాళ్ళు శుభ్రంగా వున్నాయి. మెడ రిబ్బన్ గూడా తెల్లనిదే. అదీ మెరుస్తున్నది" అంటూ ముద్దులాడుతున్నది.

గేటు తీసుకుని స్వర్ణలతా వచ్చింది. మరో కుర్చీలో కూచుని కుక్కపిల్లను పిలిచింది.

జ్యోతి నవ్వుతూ హాస్యమాడింది "ఐసీ, పొగిడారే. వాటీజ్ ది ఐడియా. ప్రస్తుతం మీకేమైనా కావాలా? పూ్యన్ని పంపక పోయారూ?"

స్వర్ణలత రోజీనందుకుంటూ నవ్వుతూ అన్నది. "కనక రత్న స్పేర్ రోకలి వుంటే యిమ్మని అడగటానికి వచ్చిందిలే జ్యోతీ. మీ ఆఫీసరుగారికి వాళ్ళ ఆఫీసరుగారు షడ్డకుడు. మీ

ఆఫీసరుగార్కికి వుసిరికాయంత వెర్రి వుంటే వాళ్ల ఆఫీసరుగారికి నిమ్మకాయంత వున్నదనచ్చు" అని బాగా నవ్వింది స్వర్ణ.

కనకరత్న నొచ్చుకోకపోగా, "బాగా చెప్పేవు స్వర్ణా. అందుకే వచ్చా. నీవెట్లా వూహించావో. పూర్యానుకి చెప్పి పంపే విషయం గాదిది. రోకలి తలకి చుట్టటం జ్యోతికి అలవాటైందని తెలిసి నాకూ నేర్పుతుందని వచ్చా. నీవెలా అన్నీ గ్రహించావూ?" అనడిగింది కనకరత్న.

"నిద్రపట్టక జ్యోతి యింటికి వస్తే స్క్రీన్ వెనకాల కూచో వింటుంటే నిద్ర వస్తుంది అని కూచోబెట్టింది. చెవులారా విన్నా. పొట్ట వుబ్బింది. పొరపాటున పైకి నవ్వుతానేమోనని బిగబట్టి కూచున్నా. మోటుహాస్యం వాడుతావన్నందుకు ఐ ఎపాలగైజ్ జ్యోతీ" అన్నది స్వర్ణ.

"నమ్మనా స్వర్ణా. యేం విన్నావో చెప్పు నాకూ్కడా నవ్వ వస్తుందేమో చూతాం."

"ఒక్కోసారి నిజాన్ని నమ్మలేం. అయినా అది నిజమే."

"చెప్పదూ. నాకు డిప్రెషన్ వచ్చింది. అది పోవాలి." అన్నది కనకరత్న.

"జ్యోతి ఆఫీసరు గిరిగారు నడుంనెప్పి పట్టింది, నాలుగు దిళ్లు వేసి వాటిమీద కూచోమంటూ దాను బెడ్‌మీద బోర్ల పడుకున్నారు. తలుపులు వేసి వస్తా అన్నది జ్యోతి." "అవసరం లేదు

నాకోస మెవరో ఒకరు వస్తూనే వుంటారు. వాళ్ల కిబ్బంది'' అన్నాడు గిరిగారు. దిళ్లు అమరుస్తూ మళ్లా అన్నది జ్యోతి ''పనిమనిషి కూతురు రంగమ్మని పిలవనా దానికి మీరంటే భక్తి, ముచ్చట్లాడుకోవచ్చు.'' వద్దు అది తొంభై పౌనులే బరువు, చూద్దు, కూచున్నట్టే వుండదు, నువ్వు నూట యిరవై పైనే వున్నావు. సరిగా సరిపోయి నెప్పి తగ్గుతుంది. అప్పటికింకా తొమ్మిదన్నా కాలేదు రాత్రి. లైట్లు వెలుగుతూ ఫాను తిరుగుతున్నది, జ్యోతి చిన్న బల్ల యెక్కి దిళ్ల మీద పడకుండా ఎడ్జెస్టయి కూచున్నాది, బెడ్ రూమ్ తలుపుల వద్ద డ్రైవరూ వాడి పెళ్లాం వచ్చి నిలబడ్డారు కాళ్లాడిస్తూ. వినోదిస్తూ తలెత్తి చేతులమీద ఆనిస్తు ఆఫీసరు చూశాడు.

''సార్ కారు సర్వీసింగ్‌కి యిచ్చి వచ్చా భోజనం కానిచ్చి వస్తానని చెప్పి వచ్చా. వెళ్లి తెస్తా సార్, కీస్ నా దగ్గరే వున్నాయి'' నవ్వుతున్నాడు.

''గ్రైండరు పని చేయటం లేదు పప్పు రుబ్బాలన్నారమ్మా, ఇస్తే దొడ్లో రోట్లో రుబ్బి యిచ్చి పోతా'' అని పెళ్లాము నవ్వుతున్నాది.

జ్యోతి మెల్లిగా దిగివెళ్లి పని కానిచ్చి డ్రైవర్ని పంపి వచ్చింది.

దిళ్లు కింద పడేసి వెల్లికిలా పడుకుని వున్న ఆఫీసర్ని చూసి కుర్చీలో కూచున్నాది జ్యోతి.

''పున్నమి వెన్నెల్లో, నీ ఒళ్లో తలపెట్టుకుని, చంద్రుని

చూస్తూ నీ చేతులమీద రాస్తూ, నా గుండెలకానిస్తూ విరహగీతాలు పాడాలని యెప్పటినించో కోరిక, అది తీరటంలేదు జ్యోతీ!"

"అదేం కోరిక పిల్లకు పదహారో యేడొచ్చింది, టెన్త్‌క్లాస్ పాసైంది, పెళ్లి చేయాలని ఆలోచించరూ? ఆ టాపిక్ యెత్తరా?"

"నీకెప్పుడూ అదే టాపిక్, సరదాలు తీర్చుకుందామనే వుండదు నీకు" అంటున్నాడు, "దానికెంతవరకు చదువుకోవాలని వుంటే అంతవరకు చదువుతుంది.

"అలాగే తీర్చుకుందురుగాని, ఇవాళ అమావాస్య చంద్రుడు రాడు. పౌర్ణమినాడెవరూ రాకుండా వుంటే మీ సరదా తీరుస్తా" అంటున్నాది జ్యోతి వాకిట్లో పిలుపు, కారు హారన్, జ్యోతి గది వదిలి వెళ్లింది.

"హలో గిరీ, మైడియర్ బోయ్, యెన్నాళ్లైంది మనం కలుసుకుని, యాత్రలు చేసి వస్తున్నాము, నేనూ నా వైపూ, దోవలో దిగాము నిన్ను చూసి నాల్రోజులు సరదాగా గడిపి పోదామని,"

గిరి ఆఫీసర్ లేచి వెళ్లి ఆ వచ్చినవారిని చూసి వెరకం చెప్పాడు.

() [] ()